క్లుప్తంగా

మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై నిర్మించిన మినీ ట్యాంక్‌బండ్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పరిశీలించారు. చెరువు కట్టపై వాకర్లు తిరిగే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని కమిషనర్ వెంకటేశ్‌ను ఆదేశించారు. మేనేజర్ శివప్రసాద్ ఏఈ సతీశ్ ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

పెద్దపల్లిరూరల్: ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా నూతన కమిటీని గురువారం పెద్దపల్లిలో జరిగిన జిల్లా మూడో మహాసభలు సందర్భంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులుగా అర్ల సందీప్, ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా ఎరుకల సాగర్‌ను ఎన్నుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన గుర్రాల పుష్పకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఎల్‌వోసీని గురువారం అందజేశారు. పుష్ప కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సిఫార్సు మేరకు రూ.2.50లక్షల ఎల్‌వోసీని సీఎం కార్యదర్శి షాహనావాజ్ ఖాసిమ్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎల్‌వోసీ పత్రాన్ని పుష్ప భర్త శంకర్‌కు అందజేశారు.

మహాలక్ష్మి పథకాలపై అవగాహన



మచ్చుపేటలో కళాకారుల ప్రదర్శన

ముత్తారం: మండలంలోని మచ్చుపేట, లక్కారంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలపై గురువారం కళాకారులు తమ ఆట పాటలతో ప్రదర్శన చేశారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీలో రూ.10లక్షలు పెంచారని కళాకారులు అవగాహన కల్పించారు. కళాకారులు ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, సలెంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కస్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి, నారగోని సరిత పాల్గొన్నారు.

గనిని తనిఖీ చేసిన డీడీఎంఎస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-1, 3 గనిని డీడీఎంఎస్ వెంకన్న గురువారం తనిఖీ చేశారు. గనిలోకి దిగి పనిస్థలాలను పరిశీలించారు. రక్షణపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. గని ఏజెంట్ సైదులు, మేనేజర్ సత్యనారాయణ, ఓదెలు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడిలో చేర్పిస్తున్న అధికారి

పెద్దపల్లిరూరల్: బడి బయట పిల్లలు బడిలోనే చేర్పించాలని పెద్దపల్లి క్లస్టర్ సీఆర్పీ వెంకటేశం అన్నారు. పెద్దపల్లి మండలం బండారికుంటకు చెందిన తల్లిదండ్రులు లేక చదువుకు దూరమైన ఎండీ సాదిక్ పాషాను గుర్తించి గురువారం రంగంపల్లిలోని అర్బన్ రెసిడెన్సీ పాఠశాలలో చేర్పించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్, జూలపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆధునిక టెక్నాలజీ సాయంతో ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు ఎస్సై వెంకటకృష్ణ అందజేశారు. జూలపల్లికి చెందిన పాటకుల రమేశ్, పెద్దాపూర్‌కు చెందిన గుర్రం లచ్చయ్య ప్రయాణంలో ఫోన్లు పోగొట్టుకొన్నారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి స్వాధీనం చేసుకుని బాధితులకు గురువారం అందజేశారు.

క్రైస్తవులకు క్రిస్మస్ కానుక

- జిల్లాకు 3వేల కానుకలు
- ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు అందజేసేందుకు పంపిన క్రిస్మస్ కానుకలు జిల్లా కేంద్రానికి చేరాయని డీఎండబ్ల్యూవో మోరాజ్ మహమ్మద్ తెలిపారు. ఆర్డీవోల ద్వారా ప్రతి మండలంలో ఉన్న క్రైస్తవులకు అందజేయనున్నారు. పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలతో పాటు ధర్మారం మండలంలో పంపిణీ చేయనున్నారు.

మండలాలకు క్రిస్మస్ కానుక

జిల్లా కేంద్రం నుంచి గురువారం వివిధ మండలాలకు క్రిస్మస్ కానుకలు చేరుకున్నాయి. జిల్లాలో 14మండలాలు 266 గ్రామ పంచాయతీలతో పాటు రామగుండం కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, ఠాగూర్ మక్కాన్ సింగ్, లక్ష్మణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేయనున్నారు.

పాస్టర్లతో ప్రత్యేక సమావేశం



కార్యాలయానికి చేరిన దుస్తులను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలోని మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గం లబ్ధిదారులకు అందించేందుకు క్రిస్మస్ కానుకలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ధర్మారం మండలానికి జగిత్యాల జిల్లా నుంచి పంపిణీ కానున్నాయి. పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి లబ్ధిదారుల జాబితాను అధికారులు స్వీకరించే అవకాశం ఉంది.

ప్రభుత్వం తరఫున విందు..

క్రైస్తవులకు క్రిస్మస్ ముందే జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో ముఖ్య పట్టణాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారు. పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి లబ్ధిదారులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విందు చేయనున్నారు.

అర్హులకు పంపిణీ



జిల్లావ్యాప్తంగా 3వేల మంది లబ్ధిదారులకు క్రిస్మస్ కానుకలను ప్రభుత్వం పంపిణీ చేసింది. లబ్ధిదారులకు 23వ తేదీ వరకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంత్రి, ఎమ్మెల్యేలతో సమయం తీసుకుని పంపిణీ చేస్తాం.

– మోరాజ్ మహమ్మద్, డీఎండబ్ల్యూవో, పెద్దపల్లి

జాబితాను ఎంపిక చేస్తాం



గ్రామాల్లో, పట్టణాలలో ఉన్న పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అర్హులైన వారి జాబితాను ఎంపిక చేస్తాం. ఎంపిక చేసిన వారి జాబితాను ప్రభుత్వం అధికారుల ద్వారా క్రిస్మస్ కానుకగా క్రైస్తవ సోదరులకు అందజేస్తం.

– విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

యువత మత్తుకు దూరంగా ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ జగదీశ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం పలు కళాశాలల విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు వాడితే కలిగే దుష్ప్రభావాల గురించి ఎస్సై విజేందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆల్కహాల్, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక ఎదుగుదల మందగించడంతో పాటు దేనిపైన ఆసక్తి ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై వినీత, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

అవగాహన సదస్సు

సుల్తానాబాద్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ ఎస్సై విజేందర్ అన్నారు. పట్టణంలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మినా.. సరఫరా చేసినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఈ నెల 31న వేడుకల పేరున రోడ్డుపైకి వచ్చి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. కళాధర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు అశోక్, రమేశ్, మునీందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జగదీశ్

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: బాక్సింగ్ విభాగంలో కాంస్య పథకం సాధించిన పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ గురువారం అభినందించారు. ఈనెల 19నుంచి 20 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి బాక్సింగ్ క్రీడలు నిర్వహించారు. సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 14, 17ఏళ్ల బాలుర విభాగంలో బి.రవిచంద్ర 42–44 వెయిట్ కేటగిరీలో జి.నిఖిల్‌రావు 80 వెయిట్ కేటగిరీలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

జూలపల్లి/ఎలిగేడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో అర్హులైన 18ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దారు స్వర్ణ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో జూలపల్లి, ఎలిగేడు మండలాల బీఎల్‌వోలకు ఒకరోజు శిక్షణను నాయబ్ తహసీల్దారు అబుబాకర్‌తో కలిసి ప్రారంభించారు. జూలపల్లి నాయబ్ తహసీల్దారు అబుబాకర్ మాట్లాడుతూ ఓటరు నమోదు సవరణలో బీఎల్‌వోలు పారదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం నుంచి శిక్షణ కోసం వచ్చిన నాయబ్ తహసీల్దార్లు రాముడు, రవీందర్‌రెడ్డి బీఎల్‌వోలకు ఓటరు నమోదు, చిరునామా మార్పులు, తీసివేతలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో బీఎల్‌వోలతో పాటు ఆర్ఐలు సంపత్, సదయ్య, ఆశాలు, కారోబార్లు పాల్గొన్నారు.



శిక్షణలో బీఎల్‌వోలు

ఎలిగేడులో షటిల్ టోర్నమెంట్

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఆర్వి లిటిల్‌కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో 25 నుంచి జెడ్పీహైస్కూల్‌లో ఓపెన్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్లు నాగరాజు, మల్లేశ్, ఎం.మల్లేశ్ తెలిపారు. టోర్నమెంట్ కేటగిరీ డబుల్స్ మాత్రమేనని, ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించాలన్నారు. పోటీలలో యోనెక్స్ మావిస్ 10 రేంజ్‌కాక్ వాడతామని, అన్ని లీగ్ మ్యాచ్‌లు 21పాయింట్లు సింగిల్ సెట్‌లో నిర్వహణ, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు 15పాయింట్లు మూడు సెట్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. విన్నర్‌కి రూ.5వేలతోపాటు బహుమతి, రన్నర్‌కు రూ.3వేలతోపాటు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 99085 28683, 80089 60447, 97044 01805 నంబర్లను సంప్రదించాలని ఆర్గనైజర్లు తెలిపారు.

రామానుజన్ జయంతి

సుల్తానాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో రామానుజన్ జయంతి నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ మేధావుల్లో ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడిగా రామానుజన్‌కు దక్కిందన్నారు. గురువారం పాఠశాలలో రామానుజన్ సంఖ్యగా గుర్తింపు పొందిన నంబర్ 1729 ఆకారంలో విద్యార్థులు కూర్చొని నివాళి అర్పించారు.



1729 ఆకారంలో విద్యార్థులు

గ్రామగ్రామానికి అయోధ్య రాముడి అక్షింతలు



రామగుండం: శ్రీరామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి రాములవారి అక్షింతలను గ్రామ గ్రామాన ప్రతీ భక్తుడికి పంపిణీ చేశారు. గురువారం అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని వివిధ గ్రామాలకు అక్షింతలను ఊరేగింపుగా, శ్రీనివాస కోలాట బృందం ప్రదర్శనలతో భక్తి గీతాలాపన మధ్య తరలించారు. మామిడి విజయలక్ష్మి, లత, శారద, శ్రీలత హాజరయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో 26న నిర్వహించే శ్రీదత్తసాయి జయంతి ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆలయ కమిటీ చైర్మన్ కస్నూరి సతీశ్‌కుమార్ ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల, మడక, కనగర్తి గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. సుల్తానాబాద్, జమ్మికుంటకు వెళ్లే అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

పంట పరిహారం ఇప్పించాలి

మంథని: మంథని మండలం నాగెపల్లి–సోమన్‌పల్లి శివారులో రోడ్డులో ఉన్న పత్తి చేను పీడీఆర్ కంపెనీకి సంబంధించిన లారీలు తరచూ నడవడంతో మట్టి, దుమ్ముతో పంట దెబ్బతిన్నదని మండలంలోని నాగెపల్లికి చెందిన చెలిమల్ల పోచిరెడ్డి అనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరిహారం ఇప్పించాలని కోరారు.

డంపింగ్‌యార్డును ఖానాపూర్‌కు తరలించొద్దు

మంథని: మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును ఖానాపూర్ గ్రామానికి తరలించొద్దని గ్రామస్తులు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. డంపింగ్‌యార్డుతో గ్రామంలోని ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని, అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ మంథని మల్లేశ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

హజరత్ తాజోద్దీన్‌బాబాకు మొక్కులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని హజరత్ తాజోద్దీన్ బాబాకు కాంగ్రెస్ నాయకులు మొక్కులు చెల్లించారు. గురువారం రామగుండం నుంచి పాదయాత్రగా వచ్చిన మాజీ కార్పొరేటర్ మహ్మద్ నస్రీన్ బేగంలు ఆటోనగర్ గుట్టకు చేరుకుని హజరత్ తాజోద్దీన్ బాబా వద్ద మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ గెలవడంతో మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, వలి పాషా, దస్తగిరి, ముంతాజ్ జాకీర్ షరీఫ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియామకం

జ్యోతినగర్: కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ ఉపాధ్యక్షుడిగా గోషిక రవిని నియమిస్తూ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఉత్తర్వులు జారీ చేశారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, మల్యాల మోడల్ స్కూల్, పెగడపల్లి జెడ్పీ హైస్కూల్, జెడ్పీ హెచ్ఎస్ కాల్వశ్రీరాంపూర్, కూనారం జెడ్పీ హెచ్ఎస్ కేజీబీవీ హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి జగదీశ్వర్ తన తల్లి మధురమ్మ ట్రస్ట్ పేరున అందజేశారు. ఎంఈవో ఆరెపల్లి రాజయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేద్దాం

మంథని: విద్యుత్‌ను ఆదా చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని, దేశాభివృద్ధికి తోడ్పాడు ఉంటుందని రెడ్కో సంస్థ కరీంనగర్ జిల్లా మేనేజర్ పరమాచారి అన్నారు. గురువారం మంథనిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పోటీలు నిర్వహించి బహుమతి అందజేశారు. సంస్థ ఏడీఈ లక్ష్మీ కాంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు గని కార్మికుల విజయం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని తీర్పునివ్వడం గని కార్మికుల విజయమని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి అన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఏడాదిగా జరుపుతున్న న్యాయ పోరాటానికి విజయం దక్కిందన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన నిరుపేద మెడిసిన్ విద్యార్థి దర్విన్‌కు గురువారం వీహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.36వేలు అందించారు. విద్యార్థి మెడిసిన్ చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కలగకుండా ఉండేందుకు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాల్ల హరీశ్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ప్రతీ ఏటా విద్యార్థికి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఫౌండేషన్ రామగుండం టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లు పరిశీలన

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం సందర్శించి చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సభలో అందరికీ అనుకూలంగా బారికేడ్స్ ఏర్పాట్లు చేస్తున్నామని, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. వివిధ డిపార్ట్‌మెంట్స్ స్టాల్స్ సేవా ఉత్పత్తులు, సేవా సభ్యుల తిను బండారాల స్టాల్స్, ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేసేలా చూడాలన్నారు. జీఎం వెంట అధికారులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన సదస్సు

రామగిరి: ఆదాయ పన్ను చెల్లింపులు, సింగరేణి సంస్థ పాటించాల్సిన షరతుల గురించి గురువారం సింగరేణి అధికారులకు హైదరాబాద్‌కు చెందిన ఆదాయపన్ను అధికారులు ఆదితి గోయల్, సుధాకర్ నాయక్ జీఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గడువులోగా ప్రభుత్వానికి పన్ను చెల్లించాలన్నరు. కాంట్రాక్టర్లు ఆదాయపన్ను చెల్లింపులపై అధికారులకు పలు సూచనలు అందించారు. ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఆదాయపన్ను విభాగానికి సంబంధించిన అధికారులు వై.మాధవి, గీతా వెంకటలక్ష్మి, కిరణ్ కుమార్, మనీశ్‌కుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు



స్పూన్ పరుగులో పాల్గొన్న మహిళలు

రామగిరి: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జీఎం కార్యాలయ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలోని ఆయా విభాగాలు, ఆయా గనుల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సింగరేణి దినోత్సవం రోజున బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డీవైపీఎం, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గుర్రం శ్రీహరి, కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ ఆర్.లక్ష్మణ్, సేవా కోఆర్డినేటర్ బి.రాయమల్లు, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

అలరించిన పోటీలు

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక జీఎం కాలనీగ్రౌండ్‌లో మహిళలకు నిర్వహించిన పోటీలు అలరించాయి. పోటీలను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. రన్నింగ్ రేస్, బాంబ్ ఇన్ ది సిటీ, బెలూన్ ఊదడం, పిరమిడ్, బాల్‌త్రో, లెమన్ స్పూన్ రన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు 23న నిర్వహించే వేడుకల్లో బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జేఎన్‌టీయూలో ఫ్రెషర్స్ డే

రామగిరి: సెంటినరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి స్థానిక మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఇఇఇ విభాగ అధిపతి దుర్గారావ్, డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి సుమన్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ (మోడల్) అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమల, రెవెన్యూ పరిశీలకులు రాజేందర్‌రెడ్డి, ఐడీసీఎస్ సూపర్‌వైజర్ అంజలి, కారోబార్ రాపోలు విద్యాకర్‌రావు, పీతాంబర్, విశారద, ఆశావర్కర్లు స్రవంతి, జ్యోతి, గాయత్రి, సంతోషి, ధనశ్రీ, లావణ్య, వనమాల, రమ్య, లక్ష్మి ఉన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు


జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ కిండర్ గార్డెన్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నృత్యాలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం ఫ్రాన్సిస్ డామినిక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ రాజశేఖర్ పాల్గొన్నారు.



నాటక ప్రదర్శనలో చిన్నారులు

షెడ్డును యువజన కాంగ్రెస్ కార్యాలయానికి కేటాయించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లో గౌతమి డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయం నిర్వహిస్తున్న షెడ్డును రాజీవ్ యువజన కాంగ్రెస్ కార్యాలయానికి కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పార్కు పేరుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువజన కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు చేసింది. ఆ స్థలంలో మాజీ కార్పొరేటర్ సోమారపు లావణ్య గౌతమిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరుతో పదేళ్లుగా వినియోగిస్తున్నారు. అధికారులు స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ రాజీవ్ యువజన కాంగ్రెస్ కార్యాలయానికి కేటాయించాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న బెంద్రం రాజిరెడ్డి

క్రైస్తవులకు దుస్తుల పంపిణీ

మంథని: క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం క్రైస్తవులకు ప్రతి ఏటా అందించే కానుకలను మంథనిలో పంపిణీ చేశారు. గురువారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథనితో పాటు రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్, పాలకుర్తి మండలాలకు చెందిన క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ గిరి, మంథని, రామగిరి ఎంపీపీలు కొండ శంకర్, ఆరెల్లి దేవక్క, మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీశ్, మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ ఉన్నారు.

ముత్తారం: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, తహసీల్దార్ బండి రాజేశ్వరి క్రైస్తవులకు దుస్తులు, గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు.